# ఫలితమిచ్చిన నమూనా సీట్ల కేటాయింపు

## రేపు ఎప్‌సెట్ తొలి విడత సీట్ల కేటాయింపు

ఈనాడు, హైదరాబాద్: ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో తొలిసారిగా అమలు చేసిన మాక్ సీట్ల కేటాయింపు సత్ఫలితాలిస్తోంది. నమూనా కౌన్సెలింగ్‌లో భాగంగా 94,059 మంది విద్యార్థులు కళాశాలల వారీగా బీటెక్ బ్రాంచీల కోసం ఐచ్ఛికాలు ఇచ్చారు. అసలు కౌన్సెలింగ్(తొలి విడత) నాటికి అవగాహన పెంచుకున్న తర్వాత... ఏకంగా 47.22% అంటే 44,553 మంది ఆప్షన్లు మార్చుకున్నారు. వారిలో కొందరు కళాశాలల ప్రాధాన్యాన్ని, మరికొందరు ఇంజినీరింగ్ బ్రాంచీల ప్రాధాన్యక్రమాన్ని మార్చుకున్నారు. తక్కువ ఆప్షన్లు నమోదు చేసుకున్న పలువురు ఉత్తమ ర్యాంకర్లకు మాక్ కౌన్సెలింగ్‌లో సీటు దక్కలేదు. అలాంటి వారు ప్రస్తుతం అప్రమత్తమయ్యారు. ఈ నెల 18న తొలి విడత సీట్లను కేటాయించనున్నట్లు ఎప్‌సెట్ ప్రవేశాల కమిటీ వర్గాలు తెలిపాయి.

**ఎప్‌సెట్ మాక్ కౌన్సెలింగ్ తర్వాత ఇదీ పరిస్థితి**

| విషయం | మాక్ | అసలు | తేడా |
|---|---|---|---|
| ఆప్షన్లు ఇచ్చినవారు | 94,059 | 94,354 | 295 |
| మొత్తం ఆప్షన్లు(లక్షల్లో) | 56.63 | 59.31 | 2.68 |

### ఇది మరో అవకాశం

**- బాలకిష్టారెడ్డి, ఛైర్మన్, రాష్ట్ర ఉన్నత విద్యామండలి**



ఎప్‌సెట్‌లో మంచి ర్యాంకు సాధించడం ఎంత ముఖ్యమో, ప్రాధాన్యాన్ని గుర్తించి వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవడం అంతకంటే ముఖ్యం. ఆప్షన్లు ఇచ్చుకోవడం తెలియకుంటే ఉత్తమ ర్యాంకర్లకు నాసిరకం కళాశాలల్లో సీటు రావొచ్చు. ఏటా అవగాహనా లోపంతో ఎంతో మంది నష్టపోతుండటంతో ఈసారి మాక్ సీట్ ఎలాట్‌మెంట్‌ను ప్రవేశపెట్టాం. మాక్ కౌన్సెలింగ్ తర్వాత... దాదాపు సగం మంది ఆప్షన్లు మార్చుకున్నారు. మొత్తానికి 2.68 లక్షల ఆప్షన్లు పెరిగాయి. ఒకరకంగా మాక్ సీట్ల కేటాయింపు అంటే రెండో అవకాశం అన్నట్లే.

# జేఎన్‌టీయూ బీవోఎస్ సమావేశం 24 నుంచి

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ క్యాంపస్‌తోసహా మిగతా ఏడు అనుబంధ కళాశాలలకు సంబంధించి ఇంజినీరింగ్ కోర్సుల్లో సిలబస్ మార్పుపై ఈ నెల 24, 25 తేదీల్లో బీవోఎస్(బోర్డ్ ఆఫ్ స్టడీస్) సమావేశం నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే జేఎన్‌టీయూ గుర్తింపు పొందిన ప్రైవేటు కళాశాలలకు సంబంధించిన సిలబస్ మార్పు, కోర్సు స్ట్రక్చర్‌పై బీవోఎస్ సమావేశాలు ముగిశాయి. దీనికి సంబంధించి సిలబస్ మార్పు, కోర్సు స్ట్రక్చర్‌పై తుది కసరత్తు జరుగుతుండగా.. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(ఈసీ) ధ్రువీకరణ పొందిన అనంతరం మరో వారం రోజుల్లో వివరాలు ప్రకటించే అవకాశాలున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం జేఎన్‌టీయూ క్యాంపస్‌తోసహా వర్సిటీ అనుబంధంగా ఉన్న మరో ఏడు (మంథని, మహబూబాబాద్, పాలేరు, సుల్తాన్‌పూర్, సిరిసిల్ల, జగిత్యాల, వనపర్తి) కళాశాలల సిలబస్ మార్పు, కోర్సు స్ట్రక్చర్, రెగ్యులేషన్స్(ఆర్-25)పై కొన్ని రోజులుగా కసరత్తు ముమ్మరమైంది. దీనిపై నిర్వహించనున్న బీవోఎస్ సమావేశంలో ఉస్మానియా, సెంట్రల్ యూనివర్సిటీ నిపుణులతోపాటు పారిశ్రామిక రంగం, అలుమ్ని ప్రతినిధులు పాల్గొననున్నారు. రెండు రోజుల సమావేశంలో జేఎన్‌టీయూ 8 కళాశాలల్లో సిలబస్‌పై చర్చించి.. తుది నిర్ణయానికి వస్తారు. 8 కళాశాలల్లో ఒక్కటే సిలబస్, ఒకే పరీక్ష విధానం ఉండేలా విధి, విధానాలు సిద్ధం కానుండడం గమనార్హం.

# ఐడీడీఎంపీ కోర్సుల్లో ప్రవేశానికి గడువు 18 వరకు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ, స్వీడన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఐడీడీఎంపీ(ఇంటిగ్రేటెడ్ డ్యూయల్ డిగ్రీ మాస్టర్ ప్రోగ్రాం) కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 18తో గడువు ముగియనుంది. ఇప్పటి వరకు మొత్తం 146 దరఖాస్తులు రాగా.. రెండు రోజులు మాత్రమే గడువు ఉంది. స్వీడన్‌తో ఒప్పందంలో భాగంగా ఐదేళ్ల ఐడీడీఎంపీలో సీఎస్ఈ, ఏఐఎంఎల్, ఈసీఈ, ఎస్‌డబ్ల్యూఈ(సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్) కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. ఒక్కో కోర్సులో 20 సీట్ల చొప్పున మొత్తం 80 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సుల్లో చేరిన వారు మూడేళ్లు జేఎన్‌టీయూలో.. రెండేళ్లు స్వీడన్‌లో చదువుతారు. ఎప్‌సెట్, జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ ఆధారంగా ప్రవేశాలుంటాయి. ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 23న కౌన్సెలింగ్ ఉంటుందని జేఎన్‌టీయూ ప్రవేశాల విభాగం డైరెక్టర్ బి.బాలునాయక్ తెలిపారు.

# ఎప్‌సెట్ వెబ్‌ఆప్షన్లు సవరించిన సగం మంది

- 18న మొదటి విడత సీట్ల కేటాయింపు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎప్‌సెట్ (ఎంసెట్) తొలివిడత కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా వెబ్‌ఆప్షన్లలో మార్పు, చేర్పుల గడువు మంగళవారంతో ముగిసింది. ఈ నెల 12న మాక్ కౌన్సెలింగ్‌లో భాగంగా 77,154 మందికి సీట్లు కేటాయించారు. 5,900 సీట్లు మిగిలాయి. మరోవైపు సరిపోయినన్ని వెబ్‌ఆప్షన్లను నమోదు చేయకపోవడం, ఇతర కారణాల వల్ల 16,905 మందికి సీట్లు కేటాయించలేదు. దీంతో అప్రమత్తమైన అభ్యర్థులు ఎప్‌సెట్ మొదటి విడతలో వెబ్‌ఆప్షన్ల మార్పుచేర్పుల అవకాశాన్ని వినియోగించుకున్నారు. దాదాపు సగం మంది అభ్యర్థులు ఆప్షన్లను సవరించారు. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎప్‌సెట్ ప్రవేశాల కన్వీనర్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 95,256 మంది అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారని తెలిపారు. వారిలో 94,354 మంది అభ్యర్థులు 59,31,279 వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని వివరించారు. మాక్ కౌన్సెలింగ్‌లో 56,63,308 వెబ్‌ఆప్షన్లను మాత్రమే నమోదు చేశారని పేర్కొన్నారు. ఈనెల 18న లేదా అంతకంటే ముందే ఎప్‌సెట్ మొదటివిడత ప్రవేశాలకు సంబంధించిన సీట్లను కేటాయిస్తామని తెలిపారు.